క్లుప్తంగా

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

ఎలిగేడు: మండలం నర్సాపూర్‌లో ఎస్సీ కులస్తుల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున మహిళలు తలపై బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు.

బాధిత కుటుంబానికి చేయూత



జ్యోతినగర్: బాధిత కుటుంబానికి మేమున్నామంటూ శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు చేయూత అందించారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం రెండో డివిజన్ పీకే రామయ్య కాలనీకి చెందిన శివాణి గతంలో భర్తను కోల్పోయింది. నలుగురు అమ్మాయిలు, ఒక బాలుడు, వృద్ధురాలైన అత్తమ్మతో ఉంటున్నారు. వారి దీనస్థితిని గమనించిన సేవాసమితి వ్యవస్థాపక సభ్యురాలు గోలివాడ చంద్రకళ స్పందించి తమ వాట్సాప్ గ్రూపులోని మిత్రులకు తెలియజేశారు. ఆమె కుటుంబానికి రెండునెలలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. గోలివాడ చంద్రకళ, కంది సుజాత, మేడి సుభద్ర, మందల రమాదేవి, మెడగోని స్వప్న, సరిత, లక్ష్మి, శ్రీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామేశ్వరాలయం చైర్మన్‌గా మోహన్‌రెడ్డి



సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని శ్రీ రామేశ్వరాలయం కమిటి చైర్మన్‌గా తాజా మాజీ సర్పంచ్ మోరపల్లి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోరుట్ల కృష్ణచారిలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలాగే వైస్‌చైర్మన్‌గా మేకల రాజయ్య, కోశాధికారిగా భూమయ్య, సహాయ కార్యదర్శిగా మల్లయ్యలను ఎన్నుకున్నారు. అలయాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని చైర్మన్ అన్నారు.

'ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు'

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి నష్టపోతే నాటి ప్రభుత్వంలో ఉన్న నాయకులు ఆనాడు రైతులకు పరిహారం ఇప్పించడంలో విఫలమై నేడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంథని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంత రైతాంగం పంట పొలాలకు నీరందించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అయిలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, నాయకులు పోలు శివ, మంథని సత్యం, కిషన్, ఐలి శ్రీనివాస్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్యదర్శి సంతోష్

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె, రొంపికుంట, పేంచికల్‌పేట గ్రామాల్లో కమాన్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం పీఏసీఎస్ కార్యదర్శి తిమ్మరాజు సంతోష్‌కుమార్ ప్రారంభించారు. రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



మంథని: మంథనిలోని శ్రీలక్ష్మీ భారతి హాల్‌లో షోటోకాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 53 మంది విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. టెస్టు అనంతరం బెల్టులు, ప్రశంసా పత్రాలు అందించారు. షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, మంథని మున్సిపల్ వైస్‌చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే.రవి, జేకేపీ సౌత్ ఇండియా ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, సీనియర్ మాస్టర్ బక్కయ్య, శంకర్ ఉన్నారు.

సర్కారు బడికి మంచిరోజులు

- అమ్మ ఆదర్శ కమిటీలతో స్కూళ్ల అభివృద్ధి
- మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల హాజరుశాతం పెంపే లక్ష్యం
- మండలానికి రూ.71.60లక్షల నిధులు కేటాయింపు



జూలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల

జూలపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల హాజరును పెంచే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించనుంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి పనులు గుర్తించడంతో పాటు దగ్గరుండి పనులు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలవ్యాప్తంగా అమ్మ ఆదర్శ కమిటీలకు అవగాహన కల్పించారు. మండలంలో ఆదర్శ, కేజీబీవీ మినహా ఆరు ఉన్నత, నాలుగు ప్రాథమికోన్నత, 14 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 1011 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు..

పాఠశాలల్లో పనులను గుర్తించి పరిష్కరించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశారు. ఇందులో సెర్ప్ వీవో అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ప్రతి క్లాస్ నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేశారు. వీరు ప్రధానంగా విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, భవనాల మరమ్మతు, మరుగుదొడ్ల రిపేర్ పనులను గుర్తించి చేసే విధులను అప్పగించారు.

నిధులు కేటాయింపు..

ప్రతి ప్రభుత్వ పాఠశాలకు నిధులు కేటాయించారు. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు 24 పాఠశాలలకు రూ.22లక్షలు, భవనాల మరమ్మతుకు రూ.26లక్షలు, మరుగుదొడ్ల రిపేరుకు రూ.17.85లక్షలు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.5.75లక్షలు మొత్తం రూ.71.60లక్షలను అధికారులు కేటాయించారు. వీటిని హెచ్‌ఎం, వీవో అధ్యక్షురాలు జాయింట్ బ్యాంక్ ఖాతాలో జమచేసేందుకు ఖాతాలను ప్రారంభించారు. పూర్తి స్థాయిలో నిధులు వినియోగించడంతో పాఠశాలలకు సౌకర్యాలు కలగడంతో పాటు విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది.

సమస్యలు తీరుతాయి



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పనులు గుర్తించి చేయిస్తే పాఠశాలల్లో సమస్యలు తీరుతాయి. విద్యార్థులు పెరిగే అవకాశం ఉంటుంది. ఇందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలి.

– అమరగాని శ్రీనివాస్, జూలపల్లి

త్వరలో పనులు



అధికారులు చెప్పినట్లు పాఠశాలల్లో పనులను గుర్తించి, అనుమతి తీసుకుని చేయిస్తాం. జాయింట్ అకౌంట్‌లు ప్రారంభించినం. నిధులు వచ్చినట్లు సార్లు చెప్పిండ్రు. త్వరలోనే పనులు చేసేందుకు కృషి చేస్తాం.

– అన్నపూర్ణ, వీవో అధ్యక్షురాలు, జూలపల్లి

పాఠశాలల అభివృద్ధి



అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో సర్కారు బడులు అభివృద్ధి చెందుతాయి. కేటాయించిన నిధులు ఉపయోగించుకొని పనులు చేయించాలి. పథకం అమలుకు సూచనలు చేస్తూ, పర్యవేక్షణ చేస్తా.

కూసుకుంట్ల రమాదేవి, ఎంపీపీ, జూలపల్లి

ఎండిపోయిన పెద్ద చెరువు



చుక్కనీరు లేని పెద్ద చెరువు

రామగుండం: నియోజకవర్గ పరిధిలో 216 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండి అర్బన్, రూరల్ పరిధిలో ఆయకట్టుకు సాగునీరందించే పెద్ద చెరువులో ప్రస్తుతం చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. అత్యధిక విస్తీర్ణం ఉన్నప్పటికీ చుట్టుపక్కలా కబ్జాలకు గురైంది. పెద్ద చెరువు కింద అర్బన్ పరిధిలోకి వచ్చే అబాది రామగుండం, పాములపేట, హౌసింగ్ బోర్డు కాలనీతో పాటు రూరల్ పరిధిలోకి వచ్చే రాయదండి, పెద్దంపేట, సుభాష్‌నగర్ తదితర గ్రామాల పరిధిలో సుమారు వందలాది ఎకరాల విస్తీర్ణానికి సాగునీటి అవసరాలు తీర్చేది. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో పెద్ద చెరువు పూర్తిగా ఎండిపోయింది. పెద్ద చెరువులో నీరు లేకపోవడంతో సమీపంలోని గొల్లోనికుంట, రామస్వామికుంటకు వరద నీరు చేరకపోవడంతో కుంటల కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టుకు కేవలం వర్షాకాలం సీజన్‌లోనే సాగు చేస్తున్నారు. పెద్ద చెరువులో నీటినిల్వలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సమీపంలోని బోర్లలో నీరురాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

గోదావరిఖని: బీజేపీ రామగుండం నియోజకవర్గ పట్టణ, మండల అధ్యక్షులను ఆదివారం పార్టీ నియమించింది. పాలకుర్తి మండల అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్, అంతర్గాం మండల అధ్యక్షుడిగా బానాల స్వామి, యైటింక్లయిన్‌కాలనీ కేశవనగర్(15, 16, 17, 18, 19 డివిజన్లు) అధ్యక్షుడిగా కొమ్ము గట్టయ్య, ఎన్టీపీసీ (1, 2, 3, 4, 5, 20, 21, 23, 24, 39)అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్, లక్ష్మినగర్ (సెంట్రల్‌జోన్) 25, 26, 31, 40, 42, 43, 47, 48, 49, 50 అధ్యక్షుడు కోడూరి రమేశ్, తిలక్‌నగర్(సౌత్‌జోన్ 12, 13, 14, 32, 33, 34, 35, 36, 37, 38, 44, 45, 46 అధ్యక్షుడు గోపగాని నవీన్‌గౌడ్, జనగాం(నార్త్‌జోన్) 6, 7, 8, 9, 10, 11, 27, 28, 29, 30, 41వ అధ్యక్షుడు గుండబోయిన భూమయ్యను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా కొండి సతీశ్

పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి యూత్ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్‌గా కొండి సతీశ్‌ను ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ స్టేట్ చైర్మన్ సల్ల నరేశ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ శివసేనారెడ్డి, యూత్ కాంగ్రెస్ స్టేట్ ఇన్‌చార్జి ఖాలీద్, తదితర నాయకులకు కొండి సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా పోచమ్మ బోనాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని 18వ డివిజన్ అల్లూరు గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గుంపుల గ్రామంలోని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జమ్మికుంట నుంచి సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్ వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 6వ తరగతి ప్రవేశం కోసం 166 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 149 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. అదే విధంగా 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశం కోసం 73 మంది దరఖాస్తు చేసుకోగా 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ దీన పేర్కొన్నారు.

ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్

మంథని: ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మంథనికి చెందిన మోహన్ నియమితులయ్యాడు. ఆదివారం రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఉన్నారు.

బియ్యం అందజేత

గోదావరిఖనిటౌన్: ఇటీవల మేదరిబస్తీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధమైన చిరువ్యాపారి చేరాల లక్ష్మి కుటుంబానికి 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ 50కిలోల బియ్యాన్ని అందజేశారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో బీజేపీదే ఘన విజయం

జూలపల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 12 సీట్లలో విజయం సాధిస్తుందని పార్టీ రాష్ట్ర ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, పెద్దాపూర్ నివాసి జేకే శేఖర్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీటీసీ అమరగాని మమత, ప్రదీప్‌కుమార్‌గౌడ్ కూతురు నూతన వస్త్రాలంకరణ ఉత్సవంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన అనంతరం మాట్లాడారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు, సతీశ్, శేఖర్ ఉన్నారు.

రైతాంగం గురించి మాట్లాడే హక్కు పుట్ట మధుకు లేదు

కమాన్‌పూర్: మంథని ప్రాంత రైతాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు పుట్ట మధుకు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు నిరసన దీక్షలో పుట్ట మధు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో నాయకులు చొప్పరి శేఖర్, శ్రీనివాస్, రవి, నిరంజన్, నరేశ్ ఉన్నారు.

యాదవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు

పెద్దపల్లిరూరల్: యాదవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను అందించనున్నామని జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని యాదవులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీసాయి నాయిబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని ఆదివారం సంఘం కార్యాలయంలో కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. కాలనీ నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రామగిరి అంజయ్య, గౌరవ అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా సీతారాములు, ప్రధాన కార్యదర్శిగా మేడిపల్లి తిరుపతి, సహాయ కార్యదర్శులుగా నాగవెల్లి రవి, రవీందర్, సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: మండలంలోని కన్నాలలో కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. ఆదివారం స్వామివారిని మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పట్టణంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు హమీద్ పాల్గొన్నారు.

ఒగ్గు కళాకారుడికి కళాకీర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకన్నగౌడ్

రామగిరి: మండలంలోని బేగంపేటకు చెందిన ప్రముఖ ఒగ్గు కళాకారుడు కొండ్ర వెంకన్నగౌడ్ కళాకీర్తి అవార్డు అందుకున్నారు. బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ వారు కళాకీర్తి అవార్డు అందజేశారు.

ఆకట్టుకున్న రామాయణం



ముత్తారం: మండల కేంద్రమైన ముత్తారంలో రెండురోజులుగా జరుగుతున్న రామాయణం ఆకట్టుకుంది. శ్రీరాముడు, లక్ష్మణుడు, విశ్వామిత్రుడి సన్నివేశం సభకుల్ని అలరించింది. చిడుతల రామాయణాన్ని స్థానికులు తిలికించారు.

ఘనంగా కాటమయ్య ఉత్సవాలు



ఉత్సవాల్లో గీత కార్మికులు

పెద్దపల్లిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మ తల్లులకు బోనాలతో మొక్కులు సమర్పించారు. గీతకార్మికులు తాటికాయలను కోసి కాటమయ్య ఉత్సవాలను నిర్వహించారు.

మైనార్టీలకు అండగా ఉంటా



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: మైనార్టీలకు అండగా ఉంటానని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. ఆదివారం రాత్రి పట్టణ కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, కౌన్సిలర్లు నిషాద్ రఫీక్, రాజు, రాజయ్య, గాజుల రాజమల్లు, బిరుదు కృష్ణ, శ్రీగిరి శ్రీనివాస్, చిలుక సతీశ్, మినుపాల ప్రకాశ్‌రావు, సంతోశ్‌రావు, బాబా, ఖలీం, ఫాహీం, మోబిన్, ఫరిక్, ఆసిఫ్, మస్రత్, అంతటి అన్నయ్యగౌడ్, దామోదర్‌రావు, అబ్బయ్యగౌడ్, కుమార్ కిషోర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీసరస్వతి శిశు మందిర్‌లో 1988 నుంచి 2015 మధ్యకాలంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఎస్.సంజయ్‌కుమార్, పల్లెర్ల కిరణ్‌కుమార్, కీర్తి నాగరాజు, ఇల్లందుల శ్రీనివాస్, సామర్ల రాజు, ఈదునూరి విజయ్‌కుమార్, ఎర్రం స్వామి, శ్రీధర్ రాజు, భూసారపు ఎల్ల య్య, కాంపెల్లి లత, రజిత, ఉష, స్వప్న, గోటికార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కోల్‌సిటీ: సమాజంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, 43వ డివిజన్ కార్పొరేటర్ ధరణి స్వరూప అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌లో ప్రజలకు ఉచితంగా షుగర్, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. నేత్ర, అవయవ, శరీర దానంపై అవగాహన కల్పించారు. సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి వాసు, మగువ లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ సునీత, కోశాధికారి శశికళ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మనాలిఠాకూర్, మేయర్ అనిల్‌కుమార్

గోదావరిఖనిటౌన్: స్థానిక అడ్డగుంటపల్లిలో దాతల సాయంతో పునః నిర్మించనున్న పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్, రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం మనాలిఠాకూర్ అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మేకల సదానందం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోచం, సూర్యదేవర జ్యోతి పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో సదాశయ ఫౌండేషన్, శ్రీసత్య సాయి భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కాలనీలోని 12మంది నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా 16 వస్తువులతో కూడిన సరుకులను వారి ఇంటికి వెళ్లి అందజేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నూక రమేశ్, సత్యసాయి భక్తులు అనంతుల రాజు, మహేందర్‌రెడ్డి, సీతారాం, నరసింహచారి, హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి మాజీ సర్పంచ్ గంగాధర శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్‌తో పాటు ఆయన అనుచరులు కాంగ్రెస్‌లోకి చేరారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం

కోల్‌సిటీ: నేత్రదానం చేసి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన గోదావరిఖని తిరుమలనగర్‌కు చెందిన ఆర్ల రాజం స్ఫూర్తిగా నిలిచారని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి కొనియాడారు. ఆదివారం రాజం సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేత్రదాత భార్య నరసమ్మ, కుమారుడు సతీశ్, కూతుళ్లు సువర్ణ, స్వరూప, స్రవంతికి సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి కే.ఎస్.వాసు, మున్సిపల్ కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేశ్, మాజీ సర్పంచ్ బడికెల నర్సయ్య ఉన్నారు.

ఇసుక తరలించొద్దు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కదంబాపూర్ మానేరు వాగులో అక్రమంగా ఇసుకను తరలించొద్దని ఆదివారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోస్కుల సదయ్య మాట్లాడుతూ ఇసుకను తరలించడం ద్వారా భూగర్భజలాలు అడుగంటి పొలాలు ఎండిపోతున్నాయని వాపోయారు. తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు కొమురయ్య, చోటు, అజయ్, కుమార్ ఉన్నారు.

పుట్ట నారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన సోదరుడు పుట్ట రాజన్న కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కోదండరాం సింగరేణి సీఅండ్‌ఎండీ, సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

శివమల్లికార్జున స్వామి పట్నాలు

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శివ మల్లికార్జున స్వామి పట్నాలు, బోనాల్లో భాగంగా ఆదివారం ఒగ్గు పూజలు మల్లికార్జుస్వామి పట్నం వేసి మల్లన్న జీవిత కథను భక్తులకు వినిపించారు. యాదవ సంఘం సభ్యులు మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు పాల్గొన్నారు.